క్లుప్తంగా

చంద్రబాబు వ్యాఖ్యలు హాస్యాస్పదం


వైఎస్సార్‌సీపీ నేత భీమేశ్వరరావు

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు బుడమేరు కాలువను పట్టించుకోక పోవడంతోనే విజయవాడలో వరదలకు కారణమని సీఎం చంద్రబాబు, మంత్రులు అనడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కరోనా వంటి విపత్తును, ఎన్నో సమస్యలను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమర్థవంతంగా ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వంలా కుంటి సాకులు ఏనాడు చెప్పలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, అలాగే రాష్ట్రం విడిపోయిన తరువాత ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన చంద్రబాబు బుడమేరును అప్పుడెందుకు పట్టించుకోలేదని ఆయన ప్రశ్నించారు.

నూతన సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ కృష్ణబాబు

జంగారెడ్డిగూడెం: సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి వంటి మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేస్తానని సీఐ వి.కృష్ణబాబు అన్నారు. సోమవారం జంగారెడ్డిగూడెం సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్‌లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. 2009 బ్యాచ్‌కు చెందిన కృష్ణబాబు కృష్ణా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై జంగారెడ్డిగూడెం సీఐగా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసి పి.రాజేష్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ కృష్ణబాబును జంగారెడ్డిగూడెం, తడికలపూడి ఎస్సైలు షేక్ జబీర్, చెన్నారావు, జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, సిబ్బంది మర్యాపూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

టి.నరసాపురం: మండలంలోని మక్కిగూడెంలో షాలేము గాస్పెల్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు కురసం నిరీక్షణరావు అధ్యక్షతన స్థానిక చర్చిలో సోమవారం ఫైర్ ప్రేయర్ టీం 4వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన అధ్యక్షుడిగా పాస్టర్ జి.జ్ఞాన్ రాజు, గౌరవ అధ్యక్షుడిగా పాస్టర్లు సీహెచ్ హోషేయ, కె.నిరీక్షణరావు, కార్యదర్శి వై.పాల్‌చిన్నారావు, కోశాధికారి సీహెచ్ రమేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పాస్టర్లు టి.ప్రసన్న, టి.అకుల, జాన్, మీకా, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల సేకరణ


దుస్తులను సేకరిస్తున్న ఉపాధ్యాయులు

పోలవరం రూరల్: మండలంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఉపాధ్యాయులు కదిలారు. ఉపాధ్యాయులు లక్ష్మణరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ఆటోలో పాత బట్టలను సేకరిస్తున్నారు. ఈ దుస్తులను విజయవాడ వరద బాధితులకు అందజేస్తామని తెలిపారు.

వరద బాధితుల సహాయార్థం విరాళం

ద్వారకాతిరుమల: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ద్వారకాతిరుమల గ్రామానికి చెందిన వ్యాపార వేత్త నార్ల కాశీనాథం సీఎం సహాయ నిధికి రూ.50 వేలను విరాళంగా అందజేశారు. ఈ నగదును సోమవారం కాశీనాథం కుమారుడు రాజేంద్ర టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీను లకు అందజేశారు.

లంక గ్రామాల ప్రజలను ఆదుకోవాలి

ఏలూరు రూరల్ : ముంపుబారిన పడిన కొల్లేరు ప్రజలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన జిల్లా కార్యవర్గ సభ్యుడు డీఎన్‌వీడీ ప్రసాద్, పి.కిషోర్, కె.శ్రీనివాస్, పీవీ రామకృష్ణతో పాటు ప్రసాద్, పి.కిషోర్ తదితరులతో కలిసి కొల్లేరు గ్రామం మాధవాపురాన్ని సందర్శించారు. రవి మాట్లాడుతూ వర్షాలు, వరద తాకిడికి కొల్లేరు గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరులో చిక్కుకుపోయిన ప్రజల ను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. ముంపుబారిన పడిన లంకగ్రామాల ప్రజలకు తాగునీరు, మందులు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

భయం గుప్పెట్లో గిరిజన గ్రామాలు

- ఏజెన్సీని వదలని వరద
- మళ్లీ గోదావరికి వరద ముప్పు
- పొంగి ప్రవహిస్తున్న శబరి, తాలిపేరు ప్రాజెక్ట్, సమ్మక్క సారక్క వాగులు
- తొమ్మిదో రోజూ జల దిగ్బంధంలో 18 గ్రామాలు
- ఆందోళనలో వేలేరుపాడు మండల ప్రజలు

వేలేరుపాడు: రెండు నెలలుగా వేలేరుపాడు మండలాన్ని రెండు సార్లు వణికించిన గోదావరి వరద మళ్లీ కలవరపెడుతోంది. భద్రాచలం వద్ద నీటిమట్టం సోమవారం క్రమేపీ వరద పెరుగుతోంది. సోమవారం రాత్రి 8 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 3 అడుగులకు చేరుకుంది. ఇది మంగళవారం సాయంత్రానికి 44 అడుగులకు చేరే అవకాశం ఉందని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు. వరంగల్ జిల్లా తుపాకుల గూడెం వద్ద సమ్మక్క, సారక్క వాగు, శబరి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. చర్ల వద్ద తాలిపేరు ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 3 లక్షల క్యూసెక్కులుగా ఉంది. దీని ప్రభావం వలన మంగళవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. గత తొమ్మిది రోజులుగా వేలేరుపాడు మండలంలో దిగువ ప్రాంతంలో ఉన్న ఎద్దెల వాగు వంతెన నీట మునిగే ఉంది. దీంతో దిగువ ప్రాంతంలో 18 గిరిజన గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి గత తొమ్మిది రోజులుగా ఆయా గ్రామాల గిరిజనులు పడవ పైనే ప్రయాణిస్తున్నారు. మళ్లీ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరిగితే అనేక గ్రామాలు జలదిగ్బంధనంలో చిక్కుకుంటాయి.

పొంగిపొర్లుతున్న కొండ వాగులు

పోలవరం రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షాలతో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. నక్కల గొయ్యి, ఇసుక కాలువ, పేడ్రాల కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ నుంచి 360 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు కొవ్వాడ కాలువ నుంచి పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరి నదిలోకి చేరుతోంది. ఎడతెరిపి లేని వర్షాల ప్రభావంతో పల్లపు ప్రాంతాల్లో రోడ్లపై ఎక్కడిక్కడ వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ముంపు పొలాల ఎన్యూమరేషన్

ఇటీవల కురిసిన భారీ వర్షాల ముంపునకు గురైన పంట పొలాలు ఎన్యూమరేషన్ చేసేందుకు మండలంలో 13 టీంలను ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ముంపునకు గురైన పొలాలను ఎన్యూమరేషన్ చేసేందుకు రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో మండల ప్రత్యేక అధికారి ఎల్.దేవకీదేవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 33 శాతం కన్నా ఎక్కువ పంట నష్టపోయి, దిగుబడి తగ్గితే ఇన్‌పుట్ సబ్సిడీ లెక్కిస్తామన్నారు. ఒక రైతుకు రెండు హెక్టార్లకు మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ వస్తుందన్నారు. ఇసుక మేట వేసిన పంట పొలాలు, రైతుల పేర్లు, పంట నష్టపోయిన వివరాలు సాగుదారు పేరుపై విడివిడిగా నమోదు చేయాలన్నారు.


పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి గోదావరిలోకి చేరుతున్న వరదనీరు

సోమవారం ఆయన మండలంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ బీఎస్‌వీఎస్ఆర్ఎల్ రాజు, ఎంపీడీవో జి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ముంపునకు గురైన పంట పొలాలను ఎన్యూమరేషన్ చేస్తున్న అధికారులు


తొమ్మిది రోజులుగా నీట మునిగిన ఎద్దెల వాగు వంతెన

విఘ్నాలు తొలగించు గణనాయకా..!

3వ రోజుకు చేరుకున్న గణపతి ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వినాయకుడి ఉత్సవాలు 3వ రోజు ఘనంగా కొనసాగాయి. వినాయక ఆలయాలతో పాటు ఆయా, చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో 13వ వార్షిక వినాయక చతుర్థి ఉత్సవాలు ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, వినాయక కమిటీ ఇన్‌చార్జి రామిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పూజల్లో కర్పూరం సతీష్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. ఆలయ శాశ్వత కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు కందులపాటి శ్రీనివాసరావు, వినాయక ఉత్సవ విగ్రహ దాత యర్రం ఉదయ్ కుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లంబోదరుడికి జంబో లడ్డు

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మూడో రోజూ వినాయకుడిని వక్రతుండునిగా పూజలు అందుకున్నారు. వివిధ దేవతలకు దశావతారాలు ఉన్నట్లే వినాయకుడికి నవరాత్రుల్లో రోజుకో అలంకరణలో పూజలు నిర్వహించాలని పురాణాలు పేర్కొంటున్నాయని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు తెలిపారు. కొయ్యలగూడెం ప్రధాన గణపతికి 32 కేజీల జంబో లడ్డూని ఉమా స్టూడియో ప్రొప్రయిటర్ శాస్త్రి బహూకరించారు. స్వామి వారికి ప్రతీ సంవత్సరం భారీ లడ్డూని సమర్పించడం ఆచారంగా వస్తుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. టెంపుల్స్ సెంటర్‌లోని మదన గోపాల స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర శిబిరంలో మహిళలు దేవతా పారాయణ నిర్వహించారు. కన్నాపురం, బయ్యనగూడెం, రాజవరం గ్రామాలలో స్వామి వారికి ప్రసాదంగా సమర్పించిన లడ్డూలు వేలం నిర్వహించారు.

పోలవరం రూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామి వారికి పూజలు నిర్వహించారు. మండలంలో పలు దేవాలయాల్లో వినాయకుడి విగ్రహానికి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు వినాయకుణ్ణి దర్శించుకొని పూజలు నిర్వహించారు.


జంగారెడ్డిగూడెంలో విజయదుర్గమ్మ ఆలయంలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెంలోని ప్రధాన గణపతికి భారీ లడ్డూని సమర్పించిన దృశ్యం


పోలవరంలో ఏటిగట్టు సెంటర్‌లో నెలకొల్పిన వినాయక విగ్రహం

అట్టహాసంగా గణేషుడి నిమజ్జనాలు

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాల్లో గణేశుడి నిమజ్జన వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. గణపతిబప్పా మోరియా నినాదాలతో గ్రామాలు మారుమ్రోగాయి. పంగిడిగూడెంలో మూడు ప్రాంతాల్లో నెలకొల్పిన గణనాధులకు ఉత్సవ కమిటీల సభ్యులు నిమజ్జన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలాగే ద్వారకాతిరుమలలోని అమ్మా అపార్ట్‌మెంట్స్ వద్ద నెలకొల్పిన గణేషుడి నిమజ్జన వేడుకను కన్నుల పండువగా నిర్వహించారు. నిమజ్జన ఊరేగింపుల్లో చిత్ర విచిత్ర శక్తి వేషధారణలు, యువకులు చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాత్రి పంగిడిగూడెంలోని పోలవరం కాలువలో గణేష్ నామస్మరణల నడుమ నిమజ్జనలను ఘనంగా నిర్వహించారు.

నేత్రపర్వంగా గణేశుడి ఊరేగింపు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలో గణనాధుడి ఊరేగింపులు సోమవారం నేత్రపర్వంగా నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భారీ సంఖ్యలో గణనాధుడి ప్రతిమలతో ఊరేగింపుగా ఎర్రకాలువ జలాశయానికి చేరుకొని నిమజ్జన కార్యక్రమాలను చేపట్టారు. ఎర్రకాలువ ప్రాంతంలో పోలీస్, రెవెన్యూ అధికారుల భద్రతా పర్యవేక్షణలో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.


ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో గణేష్ ఊరేగింపు


భద్రతా చర్యల నడుమ గణనాధుని నిమజ్జన కార్యక్రమాలు

సర్పంచులకు చెక్కుల పంపిణీ

వేలేరుపాడు: వరద ప్రభావిత పంచాయతీలకు డిప్యూటీ సీఎం అందించిన సహాయాన్ని సోమవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అందజేశారు. కొయ్యలగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో వేలేరుపాడు మండలానికి చెందిన కోయిదా, కటుకురు, నార్లవారం, తిరుమలపురం, తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, రుద్రంకోట పంచాయతీలకు రూ.లక్ష చొప్పున రూ.7 లక్షల చెక్కులను స్థానిక అధికారులకు, సర్పంచ్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో వరద ప్రభావానికి గురైన 400 పంచాయతీలకు రూ.1 లక్ష చొప్పున 4 కోట్లు ప్రకటించారన్నారు. పోలవరం నియోజక వర్గ టిపిడి కన్వీనర్ బోరగాం శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, జనసేన ప్రధాన కార్యదర్శులు కొవ్వల క్రాంతి కుమార్, మెచినేని సంజయ్, పంచాయతీ సెక్రటరీలు దావిద్, రవి, డీఎల్‌పీవో, తహసీల్దార్ చెల్లన్న దొర పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి వరద

కుక్కునూరు: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో గోదావరి నదికి ఎగువన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం పెరుగుతుంది. సోమవారం మధ్యాహ్నం భద్రాచలం వద్ద 25 అడుగులు ఉన్న గోదావరి వరద సాయంత్రం సమయానికి 30 అడుగులకు చేరింది. వాయుగుండం కారణంగా గోదావరి నదికి ఎగువ రాష్ట్రాలలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద ప్రవాహం పెరుగుతున్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడి

టి.నరసాపురం: పేకాడ ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై జయబాబు తెలిపారు. మండలంలోని లంకాలపల్లిలో నిర్వహించిన దాడుల్లో ఆరుగురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3200 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామన్నారు. అలాగే టి.నరసాపురంలో నిర్వహించిన దాడిలో 8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1550 నగదును స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల తనిఖీ

దెందులూరు: కొల్లేరు వరద నీరు ప్రమాదం బారిన పడకుండా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు సోమవారం దెందులూరు మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.కృపావరం, దెందులూరు తహసీల్దార్ బి.సుమతి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. రాత్రికి కొల్లేరు వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా కేదవరంలో లోతట్టులో ఉన్న ఇళ్లకు వెళ్లి వారందరినీ ఖాళీ చేయాలని సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో వారికి పునరావాసం కల్పించారు. ఆర్ఐ హేమమాలిని, సర్పంచ్ బోదుల స్వరూప్, వీఆర్వో శ్రీనివాస్, కార్యదర్శి షరీఫ్ తదితరులు ఉన్నారు.

పంచాయతీలకు నిధుల పంపిణీ

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గంలో 31 పంచాయతీలకు నిధుల పంపిణీ కార్యక్రమం సోమవారం వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హాజరై 6 మండలాలకు చెందిన 31 సర్పంచులకు పంచాయతీకి రూ.1 లక్ష చొప్పున రూ.31లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బుట్టాయగూడెం 9, పోలవరం 4, జీలుగుమిల్లి 2, వేలేరుపాడు 7, కుక్కునూరు 6, టి.నరసాపురం 3 పంచాయతీలకు చెందిన సర్పంచులకు పంపిణీ చేశారు. సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, కూటమి నాయకులు బొరగం శ్రీనివాస్, తోట రవి, మద్దు తేజ విశ్వనాథ్, చోడి పిండి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్‌లకు చెక్కు నమూనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ఏఐపీకేఎస్ కమిటీ ఎన్నిక

జంగారెడ్డిగూడెం: అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి జనరల్ బాడీ సమావేశం సోమవారం జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్‌లో నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే గౌస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐపీకేఎస్ సంఘ జెండాను ఎగురవేశారు. అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి, సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా జాతీయ నాయకులు కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ దేశంలో వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించడం లేదని విమర్శించారు. పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ కమిటీ ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్‌గా ఎస్‌కే గౌస్‌ను, మరో ముగ్గురు ఎస్.రామారావు, జి.ముత్యాలరావు, బి.సత్యనారాయణలను రాష్ట్ర నాయకులుగా ఎన్నుకున్నారు. ఏపీకేఎస్ జిల్లా అధక్షులు కట్టం వీరాస్వామి, అరుణోదయ జిల్లా నాయకులు కట్టం ముత్యాలరావు, మేడేపల్లి సర్పంచ్ ఎస్.రాంబాబు, నార్లవరం ఎంపీటీసీ కె.రత్తమ్మ, సర్పంచిలు విజయ, ఎం.రంగమ్మ, డివిజన్ నాయకురాలు ఎస్‌కే మున్ని, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కెచ్చెల రంగారెడ్డి

భారీ వర్షాలకు రహదారులు ఛిద్రం

ఉంగుటూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదార్లు ఛిద్రంగా మారాయి. ప్రధానంగా లింకు రహదార్లు పరిస్థితి మరీ అధ్వానంగా మారాయి. గ్రామానికి గ్రామానికి మధ్య వర్షాలకు గ్రావెల్ రహదార్లు, మెటల్ రహదార్లు, మట్టి రహదార్లు బురుదమయంగా మారాయి. మండలం పరిధిలో సెప్టెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు 99.2 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. దీంతో మండలంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా దళిత వాడలు, జగనన్న కాలనీలో నీళ్లు చేరాయి. బలహీన వర్గాల కాలనీలు, బీసీ కాలనీల్లోకి నీరుచేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లింకు రహదార్లు ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గుళ్లపాడు-చిన్న వెల్లమిల్లి, చింతాయిగూడెం-లంబాడిగూడెం, ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయం నుంచి నారాయణపురం వచ్చే రహదారి, తల్లాపురం -చేబ్రోలు రహదారి, కొత్తగూడెం-పాటిమీద, బొమ్మిడి-కాకర్లమడి, కాకర్లమూడి-తోటరాచంద్రపురం, దొంతవరం-సీతారామపురం, ,కాగుపాడు-దేవరకొండేపాడు, ముత్యాలంబపురం-ఉప్పాకపాడు గ్రామాల లింకు రహదార్లు అధిక వర్షాలకు అధ్వానంగా తయారయ్యాయి. దాంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఎడతెరిపి లేని వర్షాలకు అధ్వానంగా మారిన నారాయణపురం-ఉంగుటూరు రోడ్డు

అందరూ అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: మండల, గ్రామస్థాయి అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితో ఇప్పటి వరకు భారీ వర్షాలు వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని, రానున్న రోజుల్లోనూ అందరూ అప్రమత్తంగా ఉండాలని దెందులూరు స్పెషల్ ఆఫీసర్ ఎస్.కృపావరం అన్నారు.దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి అధ్యక్షతన అధికారులు, ఉద్యోగులతో తుఫాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కొల్లేరు వరద నీటితో లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, దెందులూరు సైఫన్, కొవ్వలి మొండుకోడు, సత్యనారాయణపురం గుండేరువాగు వద్ద అధికారుల సమన్వయం, ప్రణాళిక వల్ల ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. మరో తుఫాన్ పొంచి ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో కార్యదర్శులు, వీఆర్వోలు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

భీమడోలు: పాఠశాలల ఆవరణాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినీ పేదాడ మీనాక్షి అనారోగ్య కారణాల మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. దీనిపై బాలిక మృతికి గల కారణాలపై తగు నివేదిక సమర్పించాలని డీఈవోను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పూళ్ల ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం సందర్శించారు. ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు, ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్‌తో కలిసి పరిసరాలను పరిశీలించారు. బాలిక మృతికి గల కారణాలను సంబంధిత పూళ్ల వైద్య ఆరోగ్యశాఖ వైద్యుల నుంచి వివరాలు సేకరించారు. విద్యార్థిని దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో మృతి చెందిందని, డెంగీ జ్వరంతో కాదని వైద్యులు రాతపూర్వకంగా సమాచారం అందించారు. అనంతరం పరిసరాలు, తరగతి గదులు, టాయిలెట్స్ ప్రాంతాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షాల పాఠశాల ఆవరణంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని సంబంధిత హెచ్ఎం పి.భువనేశ్వరరావును ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో ప్రతి పాఠశాలలోని తరగతి గదులు, వంట గదులను, ఆట స్థలం ప్రాంగణాలను శుభ్రం చేయాల్సిన బాధ్యత ఆయాలపై ఉందన్నారు. వర్షాల వల్ల వరసగా సెలవులు వచ్చినందున తరగతి గదులను పరిశుభ్రం చేసుకోవాలని, మంచినీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎండీఎం వంట తయారు చేసే ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.


పూళ్ల ఉన్నత పాఠశాలలోని పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో అబ్రహాం